సాక్షి
వికారాబాద్
బుధవారం । 29 । మే । 2024



తవ్వుకో.. దండుకో

కాగ్నా నదిలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అయినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. 8లో▸



విద్యుత్ లేక..తాగునీరు రాక

ధారూరు మండలం పీసీఎం తండాలో మూడు రోజులుగా తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



టమాటాకు తామర దెబ్బ

అధిక పెట్టుబడులు పెట్టి దిగుబడులు బాగా వస్తాయని ఆశించిన టమాటా రైతులకు అరిగోస తప్పడంలేదు. 9లో▸

న్యూస్‌రీల్

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు తప్పిన ముప్పు

రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలు
జోగిపేట వద్ద ఘటన



ప్రమాదానికి గురైన చైర్‌పర్సన్ స్వప్న కారు

తాండూరు: రోడ్డు ప్రమాదంలో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నిజాంపేటలోని పుట్టినిల్లుకు వెళ్లిన స్వప్న.. కూతురు, కుమారుడితో కలిసి కారులో తాండూరుకు బయలుదేరింది. జోగిపేట పరిధిలోని గడి పెద్దాపూర్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో చైర్‌పర్సన్ కారు ఒక్కసారిగా రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీ కొట్టింది. ఎయిర్ బ్యాగ్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు టైర్ ఊడిపోయింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఆమెను జోగిపేటకు తరలించి ప్రథమ చికిత్సలు చేయించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎదురుగా వస్తున్న వాహనంలోని వారు మద్యం సేవించి వేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో బుధవారం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు మంగళవారం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మినీ స్టేడియంలో షాద్‌నగర్‌లో ఎలెవన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ టోర్నీ నిర్వహించనున్నట్లు వివరించారు. విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు రూ.25వేలతో పాటుగా ట్రోఫీ అందజేస్తామన్నారు. ఉత్తమ బ్యాట్స్‌మెన్, బౌలర్, ఫీల్డర్, కీపర్‌లకు ట్రోఫీలుంటాయని చెప్పారు.

రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక



అధికారులతో మాట్లాడుతున్న శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో వేడుకలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సందేశం రూపొందించేందుకు ఆయా శాఖల ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలన్నారు. ఉద్యాన శాఖ అధికారులు వేదికను అందంగా అలంకరించాలన్నారు. విద్యుత్ అంతరాయం ఉండొద్దన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ ప్రమీలారాణి, సీపీఓ సౌమ్య, జిల్లా అధికారులు, పోలీసులున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

ఉద్యాన శాఖ అధికారి ఉషారాణి

తలకొండపల్లి: ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఉద్యాన శాఖ అధికారిణి ఉషారాణి రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు పెంచేందుకు ప్రభుత్వం పెద్ద రాయితీలు ప్రకటిస్తోందన్నారు. మొక్కలకు 90శాతం, డ్రిప్పుపై 80నుంచి 100శాతం సబ్సిడీ అందుతుందని వివరించారు. ప్రతీ ఏడాది ఎకరాకు రూ.4,200 చొప్పున, నాలుగేళ్లపాటు ప్రభుత్వమే మెయింటెన్స్ ఖర్చులు జమ చేస్తుందని చెప్పారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. ఈ పంటలో చీడ పీడల బెడద తక్కువగా ఉంటుందని, ఎకరాకు 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ జిల్లా ఏరియా మేనేజర్ ప్రమోద్, ఫీల్డ్ ఆఫీసర్‌లు శ్రీను, రుక్మిణి, నవీన్, ఏఈఓలు శ్రీనాథ్, అనిత పాల్గొన్నారు.

రైతులకు చేరని సాగు సమాచారం

- ఎరువుల వాడకంలో శాస్త్రీయ పద్ధతులు పాటించని అన్నదాతలు
- రైతులు అనుసరిస్తున్న విధానాలకు శాస్త్రవేత్తలు చెబుతున్న పద్ధతులకు పొంతన లేని వైనం
- ఏటా మోతాదుకు మించి ఎరువుల వాడకం
- ఈ ప్రాంత భూముల్లో భాస్వరం, పొటాష్ ఎక్కువ
- నత్రజని తక్కువ ఉన్నట్లు నిర్ధారణ
- డీఏపీ వాడాల్సిన సమయం ఇదే అంటున్న శాస్త్రవేత్తలు



పత్తి సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

వికారాబాద్: రైతు చైతన్య యాత్రలు, అవగాహన సదస్సులు, పొలం బడి, మన తెలంగాణ – మన వ్యవసాయం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నా రైతులకు మాత్రం సాగుపై ప్రాథమిక సమాచారం అందిన దాఖలాలు లేవు. అవగాహన లేకపోవడంతో ఎరువుల వాడకంలో ఎలాంటి శాస్త్రీయ పద్ధతులు పాటించడం లేదు. రైతులు అనుసరిస్తున్న విధానాలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్న పద్ధతులకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. డీఏపీని దుక్కిలోనే వేయాలని శాస్త్రవేత్తలు చెబుతుండగా ఐదు శాతం రైతులు కూడా ఈ విధానాన్ని పాటించడం లేదు. ప్రస్తుత సీజన్‌లో డీఏపీని విత్తనాలు విత్తే విధంగా దుక్కి ఎరువుగా వేసుకుని వర్షాలు పడే నాటికి పొలాలను సాగుకు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

కేవలం రెండు పంటలకే..

ఇప్పటి వరకు రైతులు కేవలం పసుపు, మొక్కజొన్న పంటలకు మాత్రమే డీఏపీని దుక్కి మందుగా వాడుతున్నారు. జిల్లాలో ప్రధాన పంట అయిన పత్తితో పాటు ఇతర పంటలన్నింటికీ డీఏపీని యూరియా వాడే పద్ధతిలో పైపాటి ఎరువుగానే వినియోగిస్తున్నారు.

మోతాదుకు మించి డీఏపీ

నేల స్వభావం, భూసారంపై రైతులకు అవగాహన లేకపోవడంతో డీఏపీని మోతాదుకు మించి వాడుతున్నట్లు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంత నేలల్లో భాస్వరం మధ్యస్తంగా, పొటాషియం ఎక్కువగా, నత్రజని తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. నేల స్వభావాన్ని బట్టి ఎకరాకు పంట కాలంలో 50 కేజీల డీఏపీ మాత్రమే వాడాలి. అయితే 100 నుంచి 150 కేజీల వరకు వేస్తున్నారు. ఇది మూడు రెట్లు అధికం. మరోవైపు ఈ మందును పైపాటుగానే వేస్తున్నందున ఎలాంటి ప్రయోజనం ఉండదని శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఎరువులు – వాడాల్సిన మోతాదు

భూ సారాన్ని బట్టి ఎరువుల మోతాదు ఈ విధంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

- ప్రతి ఎకరానికి 50 కిలోల డీఏపీని వాడాలి. దీన్ని తప్పని సరిగా దుక్కి ఎరువుగానే వాడాలి. డీఏపీలో భాస్వరం ఎక్కువగా ఉన్నందున ఈ ఎరువును పైపాటుగా వేస్తే ఉపయోగం ఉండదు. పత్తి పంటకు విత్తే కంటే ముందు మూడు నుంచి నాలుగు అంగులాల లోతులో వేయాలి. మిగతా అన్ని వానాకాలం పంటలకు కూడా ఎకరానికి 50 కేజీలు మాత్రమే వాడాలి.
- ప్రతి ఎకరానికి వంద కిలోల యూరియాను వాడాలి. ఈ ప్రాంత భూముల్లో నత్రజని శాతం తక్కువగా ఉన్నందున యూరియా మోతాదు ఎక్కువగా వాడాలి. యూరియాను పైపాటు ఎరువుగా వాడవచ్చు. పత్తి విత్తిన 20రోజుల నుంచి ఐదుసార్లు యూరియా వాడాలి. వాడిన ప్రతి సారీ 30 కేజీల వరకు వేయవచ్చు. వరికి నాలుగు సార్లు వాడాలి. కలుపు తీసే సమయంలో.. తరువాత 20 రోజులకు, 30 రోజులకు, 50 రోజులకు యూరియాను వరి పైరుకు వాడాల్సి ఉంటుంది.

జిల్లాలో ఎరువుల వాడకం ఇలా..

రెండు మూడేళ్లుగా జిల్లాకు వానాకాలం ఆరంభంలో 18 నుంచి 20 వేల టన్నుల ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు సరఫరా చేస్తున్నారు. ప్రతి ఏటా డీఏపీ 17,719 మెట్రిక్ టన్నులు, యూరియా 32,329 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 19,877 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 3,658 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1,854 మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తున్నారు. ఇందులో మెజారిటీ ఎరువు యూరియా, డీఏపీనే ఉంటుంది. సరఫరా అవుతున్న ఎరువులో జూన్, జూలై మాసాల్లో 20 శాతానికి మించి వాడటం లేదు. అంటే విత్తనాలు విత్తుకునే సమయంలో దుక్కి ఎరువుగా రైతులు డీఏపీని వాడటంలేదు. ఉదాహరణకు గత వానాకాలంలో జూలై మొదటి వారంలోపు సరఫరా అయిన ఎరువుల్లో పంటలు వేసే సమయంలో 20 శాతం లోపు మాత్రమే వేయగా, మిగతా ఎరువులను పంటలు పెరిగాక పైపాటుగానే వేస్తున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా రైతులు దుక్కి ఎరువుగా వాడాల్సిన డీఏపీని పైపాటుగా వాడుతున్నారు.

శాస్త్రీయతను అనుసరించాలి



రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న శాస్త్రీయ పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాలి. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల్ని మార్చుకోవాలి. అవగాహన లేకపోవడంతో మోతాదుకు మించి ఎరువులు వాడుతున్నారు. మంచి దిగుబడి రావాలంటే పంట మార్పిడి, సేంద్రియ ఎరువుల వాడకం పెరగాల్సిన అవసరం ఉంది.

– గోపాల్, డీఏఓ



మల్బరీ తోటను పరిశీలిస్తున్న డాక్టర్ మాధురి, ఏడీఏ ముత్యాలు తదితరులు

పట్టు పురుగుల పెంపకంతో లాభాలు

- రైతులకు ప్రత్యేక రాయితీలు.
- డాక్టర్ మాధురి
- సద్వినియోగం చేసుకోవాలని సూచన

తలకొండపల్లి: వ్యవసాయానికి అనుబంధంగా పట్టు పురుగుల పెంపకం చేపట్టి అధిక లాభాలు పొందవచ్చని డాక్టర్ మాధురి అన్నారు. తక్కువ పెట్టుబడితో ఏడాది మొత్తం పంట తీసుకోవచ్చన్నారు. మంగళవారం మండల పరిధిలోని బల్సులపల్లి తండాలో పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటల సాగుపై పట్టు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ మాధురితో పాటు, జిల్లా సహాయ సంచాలకులు ముత్యాలు, షాద్‌నగర్ డివిజన్ హార్టికల్చర్ అధికారిణి ఉషారాణిలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్బరీ తోటల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ మాధురి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పట్టు పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యతిస్తుందన్నారు. రైతులకు రాయితీలు, సబ్సిడీలను అందజేస్తుందన్నారు. పట్టు పురుగులను పెంచేందుకు నిర్మించే షెడ్డుకు, లోపల నిర్మించే సెల్ఫ్‌కు, అదే విధంగా మందులు, పట్టు గుడ్లను రైతులకు సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. పట్టు పురుగులకు నాణ్యమైన మల్బరీ ఆకులను మేత వేస్తే దిగుబడి అధికంగా వస్తుందన్నారు. పట్టు సాగులో రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. అనంతరం పట్టు పురుగుల పెంపకం, మెళకువలు, మల్బరీ తోటల సాగు విధానం, ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు, షెడ్లను శుభ్రపరచుకునే విధానం, తదితర వాటిపై చర్చించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ముత్యాలు, మాజీ సర్పంచ్ దశరథ్ నాయక్, జిల్లా పట్టు పురుగుల రైతు సంక్షేమ సేవా అధ్యక్షుడు శక్రునాయక్, ఉపాధ్యక్షుడు రఫీ, రైతులు మల్లేశ్, దత్రు, రవీందర్, కాలు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కౌంటింగ్‌కు సన్నద్ధం కండి

- ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దు
- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎన్నికల సిబ్బందికి ఆదేశం

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు సిద్ధంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వరాదని సూపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎన్నికల సిబ్బందికి కౌంటింగ్ ప్రక్రియపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ చేపట్టాలని సూచించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆర్‌ఓల వద్ద కౌంటింగ్ సిబ్బంది ఆర్డర్ కాపీ, ఐడీ కార్డు తీసుకోవాలని సూచించారు. జూన్ 4వ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, 8:30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్‌ను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి రౌండ్‌కు సంబంధించిన ఫలితాలను షీట్‌లో నమోదు చేయాలన్నారు. కౌంటింగ్ సూపర్ వైజర్లు కంట్రోల్ యూనిట్లు ఆయా పోలింగ్ స్టేషన్లకు సంబంధించినవా లేదా అని చెక్ చేసుకోవాలన్నారు. ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉండాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్ స్విచ్ ఆన్ చేసి, నమోదైన మొత్తం ఓట్లు, ఫారం 17సీలో నమోదైన ఓట్లను సరిచూసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఎన్నికల విధులను సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డీఓలు వాసుచంద్ర, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్స్ రాంరెడ్డి, వీరకాంతం, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, ఆర్డీఓలు వాసుచంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు.



పాల్గొన్న కౌంటింగ్ అధికారులు, సిబ్బంది

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి హైదరాబాద్‌కు చెందిన సాయి రూ.4లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా మంగళవారం తంగడపల్లిలో గ్రామస్తులు దాత కుటుంబ సభ్యులను ఆలయం వద్ద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సత్తయ్యగౌడ్, రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

30 ఏళ్లు | 3 కోట్లు

ప్రజాధనమంటే పాలకులు, అధికారులకు పట్టింపు లేకుండా పోయింది. లక్షలు వెచ్చించి నిర్మించిన అభివృద్ధి పనులను అందుబాటులోకి తేవడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కొడంగల్‌లో రైతుల సంక్షేమం కోసం మూడు దశాబ్దాల క్రితం రూ.3 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మార్కెట్ యార్డు నేటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

మూడు దశాబ్దాల క్రితం మార్కెట్ యార్డు నిర్మాణం

- నేటికీ ప్రారంభంకాని వైనం
- క్రయ విక్రయాలు నిల్
- వినియోగంలో లేని దుకాణాలు
- నిరుపయోగంగా రూ.3 కోట్ల ప్రజాధనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



నిరుపయోగంగా ఉన్న గోదాం

కొడంగల్: రైతుల సంక్షేమం కోసం మూడు దశాబ్దాల క్రితం కొడంగల్‌లో నిర్మించిన మార్కెట్ యార్డు ప్రారంభానికి నోచుకోక వెలవెల బోతోంది. 1994లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి యార్డు పనులకు శంకుస్థాపన చేశారు. క్రయ విక్రయాల కోసం దుకాణాలు, పంట దిగుబడి నిల్వ కోసం గోదాం కూడా నిర్మించారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి వినియోగంలోకి రాలేదు. దీంతో ప్రజాధనం నిరుపయోగంగా మారింది. ఈ ప్రాంత రైతులకు మార్కెట్ యార్డును అందుబాటులోకి తేవాలని ఉద్దేశంతో నిర్మాణాలు చేపట్టారు. పనులు పూర్తయి దుకాణాలు, గోదాం అందుబాటులోకి వచ్చినా రైతులకు, వ్యాపారులకు ఉపయోగపడటం లేదు. ప్రత్యేక రాష్ట్రంలోనైనా మార్కెట్ యార్డుకు మహర్దశ వస్తుందని భావించినా అదీ జరగలేదు. తెలంగాణ ఏర్పడి పదేళ్లవుతున్నా మార్కెట్ యార్డు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

40వేల హెక్టార్ల సాగు విస్తీర్ణం

కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో 40 వేల హెక్టార్లలో సాగు విస్తీర్ణం ఉంది. ఈ ప్రాంత రైతులు కంది, పత్తి, పెసర, మినుము, వరి, జొన్న పంటలను సాగు చేస్తారు. మార్కెట్ యార్డుల లేకపోవడంతో పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోతున్నారు. ధరలోనూ.. తూకంలోనూ అన్యాయం జరుగుతోంది. ఆరుగాలం కష్టించి పండిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. నియోజకవర్గంలోని నల్లరేగడి భూముల్లో కంది పంట ఎక్కువగా పండుతోంది. ఇక్కడ పండించిన కందులకు తాండూరు, కర్నూల్, మహారాష్ట్ర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. కొడంగల్ కందులకు అంతర్జాతీయ స్థాయిలో భౌగోళిక గుర్తింపు లభించింది. మార్కెట్ యార్డును తిరిగి ప్రారంభిస్తే మేలు జరుగుతుందని రైతులు భావిస్తున్నారు.

నిరుపయోగంగా గోదాం

మార్కెట్ యార్డు ఆవరణలో రూ.3 కోట్ల వ్యయంతో గోదాం నిర్మించారు. ఇందులో 5వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేయవచ్చు. ఈ ప్రాంత రైతులు కంది, పత్తి, వరి, పెసర, మినుము పంటలను అధికంగా పండిస్తున్నారు. ధాన్యం నిల్వకు ఇబ్బందులు పడుతున్నారు. గోదాంను కేవలం కందులు, వరి, పౌర సరఫరాల బియ్యం నిల్వ చేయడం కోసం వినియోగిస్తున్నారు.



కొడంగల్ మార్కెట్ యార్డు కార్యాలయం

కొత్తగా ఆరు దుకాణాలు

కొడంగల్ మార్కెట్ యార్డులో కొత్తగా ఆరు దుకాణాలు నిర్మించారు. టెండర్ల ద్వారా వ్యాపారులకు కేటాయించారు. దుకాణాల పైభాగంలో మార్కెట్ కమిటీ కార్యాలయం నిర్మించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి మార్కెట్ యార్డుకు మంచి రోజులు వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

కూలిన గోడలకు పరిహారం ఇవ్వాలి



నాగారంలో కూలిన గోడలు

ధారూరు: కూలిన ఇళ్లను మాత్రమే నమోదు చేసుకుని.. ధ్వంసమైన గోడలను విస్మరించారని మంగళవారం మండలంలోని నాగారం, మైలారం, కుమ్మర్‌పల్లి గ్రామాల బాధితులు వాపోయారు. సోమవారం రెవెన్యూ అధికారులు వచ్చి నామమాత్ర పరిశీలన చేసి వెళ్లారని, తమని పట్టించుకునే నాథుడే లేరని వారు అసహనం వ్యక్తం చేశారు. కేవలం ముగ్గురి ఇళ్లు మాత్రమే దెబ్బతిన్నాయని నమోదు చేసుకోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. వీఆర్‌ఏ చూపించిన ఇళ్లకు మాత్రమే వెళ్లి పరిశీలించామని తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. ఎవరైనా నష్టపోతే రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతురాలు

మీర్‌పేట: చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్ కథనం ప్రకారం.. మీర్‌పేట పెద్ద చెరువులో మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని మహిళ(60) మృతదేహాన్ని గమనించిన మత్స్యకారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు మహిళ మృతదేహాన్ని వెలికితీసి చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి వివరాలు తెలియలేదని, చెరువు ఒడ్డున కళ్లజోడు, నడుము బెల్ట్ వదిలేసి ఆత్మహత్య చేసుకునేందుకే చెరువులోకి దూకినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మహిళపై అసభ్య ప్రవర్తన

మీర్‌పేట: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. మీర్‌పేట ప్రశాంతి హిల్స్‌లో నివాసముండే కర్ణాటక చించోలి ప్రాంతానికి చెందిన వలికండి నగేష్(30) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. మంగళవారం ఆయన సిర్లాహిల్స్ వాటర్‌ట్యాంక్ వద్ద ఓ మహిళతో అసభ్యకరంగా మాట్లాడాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సకాలంలో దుస్తులు అందజేయాలి

డీఆర్‌డీఓ పీడీ శ్రీలత

షాద్‌నగర్: పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు స్కూల్ యూనిఫాం అందజేయాలని డీఆర్‌డీఓ పీడీ శ్రీలత మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. షాద్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, మొగిలిగిద్ద కస్తూర్బాలో చదువుతున్న పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టడానికి ప్రభుత్వం లింగారెడ్డిగూడ, రాయికల్, చించోడ్, కిషన్‌నగర్, బూర్గుల, కమ్మదనం, మహల్ ఎలికట్ట గ్రామాల స్వయం సహాయ సంఘాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుస్తులకు సంబంధించిన వివరాలను మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుడుతున్నారు. ఎన్ని మీటర్ల బట్ట సరఫరా అయ్యింది అన్న విషయాలను ఆమె సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు విద్యార్థులకు సకాలంలో పాఠశాల యూనిఫాం అందజేయాలని సూచించారు. కొలతలకు అనుగుణంగా దుస్తులను కుట్టాలన్నారు. వచ్చే నెలలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళా సంఘాల సభ్యులు సకాలంలో దుస్తులను కుట్టడం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీయం నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

తోడుకో.. జేబులు నింపుకో!

- 'కాగ్నా'ను కొల్లగొడుతున్న అక్రమార్కులు
- అనుమతులు మాటున ఇసుక అక్రమ రవాణా
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నదీపరివాహక గ్రామాల్లో జోరుగా దందా

బషీరాబాద్: కాగ్నా నదిలో అక్రమార్కులు ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. అధికార యంత్రాంగం పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక తోడేళ్లు కాగ్నాను కొల్లగొడుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా దర్జాగా నదీ పరివాహక గ్రామాల నుంచి ఇసుకను తోడేస్తున్నారు. బషీరాబాద్ మండలంలో కాగ్నానది పరివాహక గ్రామాలైన మంతట్టి, కంసాన్‌పల్లి, జీవన్గీ, క్యాద్గిరా, గంగ్వార్, నావంద్గి, ఇందర్‌చెడ్‌తో పాటు ఎక్మాయి వాగులో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఆయా గ్రామాలలో ట్రాక్టర్లు ఉన్న కొందరు అక్రమార్కులు ఇసుకను పట్టపగలే నింపి ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు తరలించి అందిన కాడికి జేబులు నింపుకొంటున్నారు. అయితే నది పరివాహక గ్రామాల వారు ఇంటి నిర్మాణాలకు, ఇతర వాటికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. మరికొందరు నాలుగు ట్రిప్పులకు అనుమతులు తీసుకొని పది ట్రిప్పులు కొడుతున్నారు.

సరిహద్దులు దాటుకొని..

పాత అనుమతులు చూపిస్తూ దర్జాగా పట్టపగలు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఎవరైనా అడిగితే అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రీచ్‌ల దగ్గర రెవెన్యూ సిబ్బంది ట్రాక్టర్‌ల ట్రిప్పులను ఎప్పటికప్పుడూ రిజిస్టర్ చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఇదిలా ఉండగా గంగ్వార్, క్యాద్గిరా దగ్గర కాగ్నాలో పొరుగును ఉన్న కర్ణాటకలోని గ్రామాల వారు ఎడాపెడా తెలంగాణ భూభాగం నుంచి ఇసుకను తరలించుకుపోతున్నారు. గతంలో ఇరు రాష్ట్రాల అధికారులు నిర్ణయించిన సరిహద్దులు దాటుకొని ఇసుక అక్రమంగా తవ్వుతున్నారు. పలుమార్లు ట్రాక్టర్లు, టిప్పర్లు కూడా పట్టుబడి కేసులు నమోదైన అనుమతుల మాటున అక్రమ దందా కొనసాగిస్తున్నారు.



కాగ్నాలో ఇసుక తోడడంతో పడిన గోతులు



ఇసుక తరలిస్తున్న ట్రాకర్లు (ఫైల్)

అనుమతులు లేకుంటే సీజ్



ఎక్కడైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే రెవెన్యూ అధికారులకు గాని, పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలి. నదీపరివాహక గ్రామాలైన వారు తమ ఊర్లలో ఇళ్లు కట్టుకోవడానికి ఇసుక తీసుకెళ్లడానికి వీలులేదు. అనుమతులు లేకుండా ట్రాక్టర్‌ల ద్వారా ఇసుక తరలిస్తే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాం. ఇక నుంచి రీచ్‌ల దగ్గర కానిస్టేబుల్స్‌ని పెట్టి పర్యవేక్షిస్తాం.

– రమేష్ ఎస్‌ఐ, బషీరాబాద్

కరెంటు లేక.. తాగునీరు రాక

పీసీఎం తండావాసుల విలవిల



ఆటోలో నీటిని తీసుకురావడానికి వెళుతున్న గిరిజనులు

ధారూరు: మండల పరిధిలోని పీసీఎం తండాలో గత మూడు రోజులుగా తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం తండావాసులు బైకులు, ఆటోల్లో సమీప గ్రామాలకు వెళ్లి బిందెల్లో, వాటర్ డబ్బాల్లో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. విద్యుత్ సరఫరా సమస్యే తాగునీటికి అంతరాయం కల్గించిందని గిరిజనులు వాపోయారు. పీసీఎం తండాలో కొంతమంది గిరిజనుల ఇళ్ల పైనుంచి విద్యుత్ లైన్ ఉంది. విద్యుత్ లైన్‌తో తమకు ప్రమాదం ఏర్పడుతుందని యజమానులు ట్రాన్స్‌కో అధికారులకు, సిబ్బందికి తెలిపినా పట్టించుకోలేదు. దీంతో ఇటీవల గాలివానకు విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపడి సరఫరా నిలిచిపోయింది. ఇదే అదునుగా భావించి ఇళ్లపై నుంచి వెళ్లిన తీగలను కట్ చేశారు. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏకంగా తాళం వేశారు. దీంతో మూడు రోజుల నుంచి తండాకు తాగునీటి సరఫరా లేక గిరిజనులు అల్లాడారు. గత్యంతరం లేక సమీప నాగారం, బొంరాస్‌పేట్ మండలం మద్దులపల్లి గ్రామాలకు ఆటోలు, బైక్‌లపై వెళ్లి బిందెల్లో, వాటర్ బబుల్స్‌లో తాగునీటిని తెచ్చుకుంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం

ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు మంగళవారం పీసీఎం తండాకు సిబ్బందిని పంపించారు. అక్కడ తీగలు కట్ చేయడం, ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసిన విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు తెలిపారు. ఏఈ, ఇతర అధికారులు అక్కడికి చేరుకుని గిరిజనులకు అవగాహన కల్పించి త్వరలో ఇళ్లపై ఉన్న తీగలను తొలగిస్తామని నచ్చజెప్పారు. అనంతరం మరమ్మతులు చేశారు. అయినా తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. జిల్లా కలెక్టర్ తగిన చొరవ తీసుకొని తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు టౌన్: ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయమని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో డీసీఎంఎస్ ఎదురుగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు హర్షణీయమన్నారు. అనంతరం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రొంపల్లి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి వేసవిలోనూ బాటసారులకు తాగునీరు, మజ్జిగ, రాగి అంబలి వంటివి సంఘం తరపున అందజేస్తున్నామన్నారు. రెండు నెలల పాటు నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి ఆర్యవైశ్యులు సహకారం అందిస్తున్నారన్నారు. పదో రోజు కల్వ గీత, రాజశేఖర్ దంపతులు వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదానానికి సహాయం చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆలంపల్లి శ్రీనివాస్, వినోద్‌కుమార్, వాసవిక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. రైతు మృతి



సంజీవరెడ్డి (ఫైల్)



తలకిందులు అయిన ట్రాక్టర్

నవాబుపేట: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కందాడ సంజీవరెడ్డి(39) తన పొలంలో సొంత ట్రాక్టర్‌తో భూమి దున్నుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ట్రాక్టర్ తలకిందుల కావడంతో సంజీవరెడ్డి కింద ఇరుక్కుపోయాడు. వెంటనే గమనించిన పక్క పొలం రైతులు ట్రాక్టర్‌ను పక్కకు జరిపి చూడగా అప్పటికే సంజీవరెడ్డి మృతి చెందారు. ఈ విషయమై నవాబుపేట పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని ఎస్సై భరత్ భూషణ్ తెలిపారు. మృతుడికి భార్య అనూష, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

బషీరాబాద్ ఎస్‌ఐ రమేష్

బషీరాబాద్: సైబర్ నేరాల పట్ల ప్రజలు కనీస అవగాహన కలిగి ఉండాలని బషీరాబాద్ ఎస్‌ఐ రమేష్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో, కూరగాయాల సంతలు దగ్గర, బ్యాంకుల దగ్గర ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పహాడీషరీఫ్: ఎదురుగా వస్తున్న యాక్టివాను కారు ఢీ కొట్టగా ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈదిబజార్‌కు చెందిన మహ్మద్ షబ్బీర్(28), చంపాపేట్‌కు చెందిన సయ్యద్ జావెద్ (32)లు బాలాపూర్‌లోని తమ స్నేహితుడి ఇంటికి సోమవారం రాత్రి వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి వారు గణేష్ చౌక్ నుంచి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ఐ–20 కారు యాక్టివాను ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఓవైసీ ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ షబ్బీర్ తెల్లవారుజామున మృతి చెందారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



రావులపల్లి నుంచి దౌల్తాబాద్ వెళ్లే రోడ్డు

అధ్వాన రోడ్డు.. ప్రయాణానికి కీడు

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కొడంగల్ మండలం రావులపల్లి గ్రామం నుంచి దౌల్తాబాద్ మండల కేంద్రానికి వెళ్లే రాహదారిపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ద్విచక్ర వాహనదారులు పలుమార్లు ప్రమాదాల బారిన పడ్డారు. ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



ప్రీకాస్ట్ ప్రహరీ కూల్చివేసిన ప్రాంతం

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

హయత్‌నగర్: కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు అక్రమార్కులు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం మునగనూరు గ్రామంలోని సర్వే నెంబర్ 83లోని సుమారు 800 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు అక్రమార్కులు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ప్రీ కాస్టింగ్ ప్రహరీ నిర్మించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

ఎమ్మార్వోకి ఫిర్యాదు చేసిన యువకుడు



ఎమ్మార్వోకి ఫిర్యాదు చేస్తున్న బాబునాయక్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలం మోకిల తండాలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోందని బాబునాయక్ అనే యువకుడు మంగళవారం శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్‌కు ఫిర్యాదు చేశాడు. మోకిల తండాలోని సర్వే నం.76లో 29గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దాంట్లో ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనం ఉండగా.. భవనం వెనకాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇల్లు కట్టడంతో పాటు, బోర్ వేస్తున్నాడు. యువకులు గమనించి గ్రామ సెక్రటరీకి ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదు. దీంతో డయల్ 100కి కాల్ చేయగా.. వారు వచ్చి బోర్‌వేల్ యంత్రాన్ని పంపించేశారు. అనంతరం బాబునాయక్ అనే యువకుడు అక్రమ నిర్మాణం చేస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కాలు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, పాన్‌షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సుమారు రూ.2లక్షల నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు. గత రెండు రోజులుగా పట్టణంలో వివిధ దుకాణాల్లో దాడులు నిర్వహించి గుట్కాలు, తంబాకు ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

నిర్వహణ లోపించి.. డంపింగ్ నిండి

- అధ్వానంగా చెత్త నిల్వ కేంద్రాలు
- ప్రధాన ద్వారం బయటకు వ్యర్థాలు
- నాలుగేళ్లుగా నిలిచిన సేంద్రియ ఎరువుల తయారీ
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు



చెత్తతో మూసుకుపోయిన డంపింగ్ యార్డు ప్రధాన ద్వారం

తాండూరు: మున్సిపాలిటీలకు చెత్త సేంద్రియ ఎరువుల రూపంలో కాసులు కురిపిస్తుంది. అలాంటి చెత్తపై మున్సిపల్ యంత్రాంగం ప్రమాణాలు పాటించకపోవడంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయి. డంపింగ్ యార్డు పక్కనే ఉన్న చెరువులను సైతం కలుషితం చేసేలా చెత్త పేరుకుపోయి ఇబ్బందులకు గురి చేస్తోంది. తాండూరు మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులున్నాయి. ఆయా వార్డులలో పారిశుద్ధ్య పనులు చేసేందుకు దాదాపు 254 మంది కార్మికులు పని చేస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి నిత్యం 40 టన్నులు చెత్త బయట పడుతోంది. మున్సిపల్‌లో సేకరించిన చెత్తను పట్టణ శివారులో ఉన్న అంతారం డంపింగ్ యార్డుకు ట్రాక్టర్‌లు, ఆటోల ద్వారా తరలిస్తారు. అయితే చెత్త డంపింగ్ యార్డుల నిర్వహణ పార్క్‌లను తలపించేలా గతంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి నిల్వ చేశారు. మరోవైపు డంపింగ్ యార్డులో గ్రీన్ గార్డెన్‌తో పాటు మొక్కలను నాటి సుందరంగా మార్చారు.

వాయు కాలుష్యంతో ఇబ్బంది

మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగమే ప్రధానమైనది. అలాంటి విభాగాన్ని మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు చెత్త డంపింగ్ యార్డు నిర్వహణ చూస్తేనే అర్థం అవుతోంది. మున్సిపాలిటీలో వెలువడిన చెత్తను పారిశుద్ధ్య పనులు చేయించి డంపింగ్ యార్డుకు తరలించాలి. కానీ మున్సిపాలిటీలో నామమాత్రంగా పనులు చేసి కొంత వరకు చెత్తనే తరలిస్తున్నారు. డంపింగ్ యార్డులో తడి చెత్త.. పొడి చెత్త వేర్వేరుగా నిల్వ చేయాల్సి ఉంటుంది. కానీ నిబంధనలను పాటించకుండా మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది అడ్డగోలుగా చెత్తను డంప్ చేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు డంపింగ్ ప్రాంగణంలో ప్రధాన గేట్ నుంచి 100 మీటర్ల దూరంలో చెత్త డంప్ చేసేవారు. ప్రస్తుతం పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో చెత్తను ఎక్కడ పడితే అక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో రెండు మూడు నెలలుగా డంపింగ్ యార్డు ప్రధాన ద్వారం మూసివేస్తూ చెత్తను డంప్ చేశారు. మున్సిపాలిటీలో నుంచి వచ్చిన చెత్తకు డంపింగ్ యార్డులో నిప్పు పెడుతున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం వెలువడుతోంది.

కోల్పోతున్న ఆదాయం

తాండూరు మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్తతో ఎరువులు సేంద్రియ ఎరువులను తయారు చేసి మున్సిపాలిటీకి ఆదాయం పెంచుకునే అవకాశం ఉంది. అందుకోసం గతంలో మున్సిపాలిటీలో సేకరించిన తడి చెత్తతో కంపోస్టు(సేంద్రియ) ఎరువులను తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చెత్త ద్వారా తయారు చేసిన ఎరువును క్వింటాలుకు రూ.800 చొప్పున రైతులకు విక్రయించారు. దీంతో మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరింది. తర్వాత రోజుల్లో పాలక వర్గం మారడం, అధికారుల బదిలీలతో యార్డును పట్టించుకోలేదు. సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం చెత్తమయంగా మారింది.



యార్డు బయట డంప్ చేసిన చెత్త

బాలుడిపై వీధి కుక్క దాడి



తీవ్రంగా గాయపడిన బాలుడు

పరిగి: రోడ్డుపై ఆడుకుంటున్న బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన ఘటన పరిగి పట్టణ కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఇమ్రాన్ కుమారుడు షేక్‌అనోజ్ సోమవారం రాత్రి ఆరుబయట రోడ్డుపై ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాలుడిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి మొఖంపై కుక్క కాట్లు పడటంతో మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పట్టణ కేంద్రంలో వీధి కుక్క వీరంగం రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. వీధి కుక్కల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిర్యాదుల మేరకే స్పందించాం

జిల్లా మత్స్యకార అభివృద్ధి అధికారి సౌజన్య

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు మత్స్యకార సంఘంలో ఏర్పడిన విభేదాలు, ఫిర్యాదుల మేరకే చేపలను సీజ్ చేశామని జిల్లా మత్స్యకార అభివృద్ధి అధికారి సౌజన్య ప్రకటించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. తమకు తాముగా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేదని, చైర్మన్ వ్యతిరేక వర్గం ఫిర్యాదు చేయడంతో కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ మేరకు తూకం వేసి 9.7 టన్నుల చేపలను రెగ్యులర్ కాంట్రాక్టర్‌కు విక్రయిస్తే రూ.5 లక్షలు వచ్చాయన్నారు. నగదును కోట్‌పల్లి ప్రాజెక్టు మత్స్యకార సంఘం ఖాతాలో జమ చేస్తామన్నారు. మళ్లీ ఇలాంటి సమస్యే వస్తే తానేం చేయలేనని.. రాష్ట్ర కమిషనర్, జిల్లా మత్స్యశాఖ అధికారి సుచరితారెడ్డి చూసుకుంటారని తెలిపారు. ఫీల్డ్‌లో తిరిగి ఏం జరిగిందోనని తెలుసుకుని చెప్పడమే తన పని అన్నారు. చైర్మన్ ఆనంద్, మాజీ చైర్మన్ బందెయ్య వర్గాల సభ్యులను పిలిచి మాట్లాడాలని మాత్రమే సూచించామన్నారు. ఫిర్యాదులు వస్తున్నట్లు చెబుతామంటే చైర్మన్ అసలే మాట్లాడటం లేదని, షోకాజ్ నోటీసు జారీ చేస్తే కోర్టుకు వెళ్లి నేరుగా స్టే ఆర్డర్ తీసుకువచ్చారని గుర్తు చేశారు. మత్స్యకారులకు నష్టం జరగకుండా లాభం చేయడానికి తాము కృషి చేస్తున్నామని చెప్పారు. ఇదివరకే మత్స్యకార సంఘం సభ్యులు 50 టన్నుల చేపలను విక్రయించారన్నారు.